క్లుప్తంగా

అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ నమోదు తప్పనిసరి

పెదకాకాని: అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ నమోదు తప్పక చేయించాలని సూపర్‌వైజర్ సత్యవతి తెలిపారు.ఈ మేరకు మహిళా శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె చెప్పారు. పెదకాకాని కేంద్రం నిర్వాహకుడు సెలవులో ఉండటంతో సోమవారం 40 మంది చిన్నారుల ఆధార్ నమోదును వెనిగండ్ల పంచాయతీ కార్యాలయంలో చేయించినట్లు ఆమె పేర్కొన్నారు. కొందరి చిన్నారుల డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ లేకపోవడంతో తల్లుల ఆధార్, డేట్ ఆఫ్ బర్త్ ఆధారంగా నమోదు చేయించినట్లు ఆమె వివరించారు.

విజ్ఞాన్ నిరుల అధ్యాపకురాలికి డాక్టరేట్



లక్ష్మీపార్వతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాధిక తదితరులు

గుంటూరు రూరల్: పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ లక్ష్మీపార్వతికి విట్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆమె ప్రొఫెసర్ జొన్నాదుల హరికిరణ్ పర్యవేక్షణలో అప్టిమల్ డీప్ లెర్నింగ్ ఆర్కిటెక్చర్ ఫర్ సెమాంటిక్ సెగ్మెంటేషన్ ఆఫ్ బ్లాబ్స్ ఫ్రమ్ త్రీడీ హ్యూమన్ ఎంఆర్‌ఐ కిడ్నీ ఇమేజెస్ అనే అంశంపై పరిశోధన చేశారు. కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. రాధిక తదితరులు అభినందించారు.

కిట్స్ అధ్యాపకురాలికి యంగ్ సైంటిస్ట్ అవార్డు



అధ్యాపకురాలిని అభినందిస్తున్న చైర్మన్

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): వట్టిచెరుకూరు మండలం విజనంపాడు కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలకు చెందిన అధ్యాపకురాలు కె. భాగ్యలక్ష్మికి యంగ్ సైంటిస్ట్ అవార్డు లభించింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చెస్, ఏ ప్రీమియర్ ఆర్గనైజేషన్ ఇన్ ఇండియా గణితశాస్త్రంలో చేసిన పరిశోధనలకు గాను యంగ్ సైంటిస్ట్ 2022 అవార్డులను ప్రదానం చేసింది. ఇందులో కిట్స్ కళాశాలలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక కళాశాలలో చైర్మన్ కె. సుబ్బారావు, సెక్రటరీ కె. శేఖర్, ప్రిన్సిపాల్ పి. బాబుతో పాటు పలువురు ఆమెను అభినందించారు.

రజక వాచ్‌మెన్ సంఘ అధ్యక్షుడిగా దుర్గారావు

నెహ్రూనగర్: రజక అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ సంఘం నూతనంగా ఏర్పాటైంది. బ్రాడీపేటలో ఏర్పాటైన ఈ నూతన సంఘానికి వ్యవస్థాపక అధ్యక్షుడిగా మానేపల్లి దుర్గారావు, ఉపాధ్యక్షులుగా పూరే శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా భీమవరపు విజయ్, సహాయ కార్యదర్శిగా ఆరేపాటి సుబ్బయ్య, కోశాధికారిగా ఎస్. నాగార్జున, ఉప కార్యదర్శిగా సుబ్బయ్య, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు మానేపల్లి దుర్గారావు మాట్లాడుతూ అపార్ట్‌మెంట్స్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వారిలో అధిక శాతం రజక కులస్తులు ఉన్నారని, వారిపై దాడులు చేయడం పరిపాటిగా మారిపోయిందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. వాచ్‌మెన్ల కోసం రక్షణ చట్టాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి



పెదనందిపాడు : ప్రముఖ కవయిత్రి మొల్లమాంబ జయంతిని స్థానిక పురాణ కాలక్షేప కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం కేకును కట్ చేశారు. మొల్లమాంబ రచనలు, కవితా వైభవాన్ని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ షేక్ ఖాశింబీ, సర్పంచ్ దాసరి పద్మారావు, ఎంపీటీసీ సభ్యుడు కానుగుల పరమేశ్వరరావు, శాలివాహన సంఘం నాయకులు చల్లగిరి శ్రీనివాసరావు, నిజాంపట్నం సుబ్బారావు, కానుగుల నాగభూషణరావు, చల్లగిరి పకీరరావు, శనగవరపు రాము పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- గొర్లవారిపాలెంలో అంగన్‌వాడీ కేంద్రానికి భూమి పూజ



భూమిపూజలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తదితరులు

గుంటూరు రూరల్: విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండలంలోని గొర్లవారిపాలెంలో సోమవారం నూతనంగా రూ. 12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్ర భూమి పూజకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత గ్రామంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేసి భూమి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యా రంగంలో జగనన్న పెనుమార్పులు, చరిత్రలు సృష్టించారని తెలిపారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మి ప్రభుత్వ పాఠశాలల్ని ప్రైవేటుకు దీటుగా నాడు– నేడు ద్వారా రూపురేఖలు మార్చారని వివరించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాల్ని విద్యార్థుల కోసం అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో నేడు విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటుగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నారని చెప్పారు. పాఠశాలల్లో స్కూలు బ్యాగులు, దుస్తులు, బెల్ట్, బుక్స్ కిట్లను ఉచితంగా అందజేసిన ఘనత జగనన్నకే దక్కిందని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాల దిశగా చదువుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, గ్రామ సర్పంచ్ నల్లమేకల అప్పమ్మ, వైస్ ఎంపీపీ దర్శి సుజాత, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, మల్లికార్జునరెడ్డి, నల్లమేకల మాధవరావు, దర్శి సతీష్, చిట్టిబాబు, వెంకటరావు పాల్గొన్నారు.

వెనిగండ్లలో నిండుకున్న మంచినీటి చెరువులు

రెండు రోజులకు ఒకసారి సరఫరా



అడుగంటిన తాగునీటి చెరువు

పెదకాకాని: మండలంలోని వెనిగండ్లలో తాగునీటి చెరువులు అడుగంటినా, పంచాయతీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. గ్రామానికి తాగునీటి సరఫరా కోసం రెండు చెరువులు, ఫిల్టర్ బెడ్లు, వాటర్ ట్యాంక్‌లు ఉన్నాయి. వీటి ద్వారా ఇళ్లలోని 1900 కుళాయిలకు, 10 వరకూ వీధి కుళాయిలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. గ్రామంలోని చెరువులకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంటూరు చానల్ (కొత్త కాలువ) నుంచి నీరు సరఫరా అవుతుంది. రక్షిత మంచినీటి పథకం ద్వారా శుభ్రం చేసిన నీటిని గ్రామంలోకి సరఫరా చేస్తున్నారు. అయితే, ఆరు నెలల కిందట చెరువులకు నీరు సరఫరా చేస్తున్న ప్రధాన పైపులైన్‌కు శంకర కంటి ఆసుపత్రి సమీపంలో ఉన్న కల్వర్ట్ వద్ద లీకేజీతో నీరు వృథాగా పోతోంది. నెల రోజుల కిందట మరమ్మతులు ప్రారంభించినా, నేటికీ పూర్తి కాకపోవడంతో గ్రామంలో చెరువులకు నీరందక అడుగంటాయి. రెండు రోజులు మాత్రమే సరిపడా నీటి నిల్వలు మాత్రమే చెరువులో ఉన్నాయి. ఆ తరువాత గ్రామ ప్రజల దాహార్తి ప్రశ్నార్థకమే. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా పైపులైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. రెండు రోజుల్లో కాలువ నుంచి చెరువుల్లోకి నీరు చేరే ప్రక్రియ ప్రారంభమవుతుందని, గ్రామస్తులకు తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాతీయ సమగ్రతా శిబిరంలో సతీష్ ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: టీజేపీఎస్ కళాశాల బీకాం విద్యార్థి కె. సతీష్ నరసాపురంలోని వైఎస్ కళాశాలలో ఈనెల మూడు నుంచి తొమ్మిదో తేదీ వరకు జరిగిన జాతీయ సమగ్రతా శిబిరంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇటువంటి శిబిరాల్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ముందుకు వెళ్లాలని చెప్పారు. విద్యార్థి సతీష్ మాట్లాడుతూ శిబిరానికి వెళ్లడం ద్వారా తాను సామాజిక బాధ్యతతో పాటు పెద్దల పట్ల వినయ, విధేయతలు, నాయకత్వ లక్షణాల గురించి శిక్షణ పొందానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథక కార్యక్రమ నిర్వహణ అధికారి జె.వి.సుధీర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో చోరీ

గుంటూరు ఈస్ట్: ఆటో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 17వ లైనులో నివసించే మతాలాబాబు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. 12వ తేదీ రాత్రి చుట్టుగుంట సెంటర్ సమీపంలోని అన్న క్యాంటీన్ వద్ద ఆటో పార్క్ చేసి తాళాలు వేశాడు. 13వ తేదీ అక్కడకు వెళ్లి చూడగా కనిపించ లేదు. ఈ మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చి గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

మిర్చి గోడౌన్‌లో అగ్ని ప్రమాదంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. దుర్గానగర్ నివాసి అయిన రంగారావు అంగడి చెన్నయ్య స్తూపం వెనుక రేకుల షెడ్‌ను అద్దెకు తీసుకుని మిర్చి తొడాలు తీయిస్తుంటాడు. 12వ తేదీ అర్ధరాత్రి గోడౌన్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు వాసి అదృశ్యం

వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కనమర్లపూడి నీలకంఠేశ్వరరావు సమీప బంధువు వెంకట సత్యహరీష్‌కుమార్ ఈనెల 9న నెల్లూరు నుంచి గుంటూరు వచ్చాడు. అనంతరం 10న హైదరాబాద్ వెళుతున్నట్లు చెప్పి వెళ్లాడు. అయితే, ఆ తర్వాత సెల్ స్విచ్ ఆఫ్ అయ్యింది. జాడ తెలియలేదు. నీలకంఠేశ్వరరావు ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

పట్నంబజారు: వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందపేటకు చెందిన సయ్యద్ అబ్దుల్ రూ.40వేలను మునాఫ్‌కు అప్పు ఇచ్చాడు. ఈక్రమంలో తన డబ్బు ఇవ్వాలని మునాఫ్‌ను అడుగ్గా పాత బస్టాండ్ సమీపంలో ఉన్నానని రమ్మని అబ్దుల్‌ని పిలిచాడు. అక్కడకు వెళ్లిన అతడిపై మునాఫ్, రబ్బీర్, రెహమాన్, గౌస్ దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాకుమాను, ప్రత్తిపాడు ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



రవీంద్ర



రవీంద్రబాబు

కాకుమాను: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా ఎస్.రవీంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఆయన గుంటూరు అరండల్‌పేట ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు.గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన డి.రవీంద్రబాబు ప్రత్తిపాడు సర్కిల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రవీంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు.

ప్రత్తిపాడు ఎస్‌ఐగా రవీంద్రబాబు....

ప్రత్తిపాడు: స్థానిక ఎస్‌ఐగా డి. రవీంద్రబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల కిందట ఇక్కడ ఎస్‌ఐగా చేస్తున్న సీహెచ్. ప్రతాప్‌కుమార్ సాధారణ బదిలీపై సీఐడీకి వెళ్లగా, ఆయన స్థానంలో తాత్కాలికంగా ఇన్‌చార్జి ఎస్‌ఐగా ఆరోగ్యరాజును నియమించారు. ఈ నేపథ్యంలో కాకుమాను ఎస్‌ఐగా పనిచేస్తున్న డి. రవీంద్రబాబును ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన స్థానిక స్టేషనులో బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్‌ఐ రవీంద్రబాబు చెప్పారు.

ఎస్సీ శ్మశానవాటికల స్థల సమస్యకు పరిష్కారం

- రూ.9కోట్ల నిధులు కేటాయింపు
- ఎమ్మెల్యే శివకుమార్‌కు సన్మానం
- అభినందనలు తెలిపిన తెనాలి పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ నేతలు



ఎమ్మెల్యే శివకుమార్, బిషప్ సుధీర్‌కుమార్‌కు గజమాలతో సత్కారం

తెనాలి: ఎస్సీలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న శ్మశాన వాటికల సమస్యకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో పరిష్కారం లభించిందని తెనాలి పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా ఎస్సీ శ్మశాన వాటికలకు రూ.9 కోట్ల నిధులు కేటాయింపజేయడంతో ఎమ్మెల్యే శివకుమార్‌ను ఘనంగా సత్కరించారు. పట్టణ ఈరే మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో తెనాలి పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ నేతృత్వంలో సోమవారం స్థానిక అయితా నగర్‌లో నూతన చర్చి హాలులో జరిగిన సభకు బిషప్ సుధీర్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఎస్సీ శ్మశానవాటికలకు స్థలం సరిపోవటం లేదని, విస్తరణను ఎప్పట్నుంచో ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్తున్నా.. ఎలాంటి పురోగతి లేదని సుధీర్‌కుమార్ చెప్పారు. శ్మశాన వాటికల స్థలం కేటాయింపును ఎమ్మెల్యే శివకుమార్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించినట్లు చెప్పారు. గత నెల 28న తెనాలి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి సభాముఖంగా ఎమ్మెల్యే సమస్యను వివరించటం, ఆ వెంటనే ముఖ్యమంత్రి రూ.9 కోట్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించటంతో దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించిందని చెప్పారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పడుతోందన్నారు. ఎస్సీ వర్గాలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కూడా సహకరిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన తెనాలిలోని పలు సమస్యలకు రూ.43 కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. పలు చర్చిల పాస్టర్లు ఫాదర్ విజయానంద్, జైపాల్, వీబీ సర్వోన్నతరావు, ఎ.భానుప్రసాద్, ఇమ్మానియేలు దాస్, లెనిన్, టి.డేవిడ్ తదితరులు తమ ప్రసంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలియజేశారు.

జీజీహెచ్‌లో రోగి మృతిపై ఫిర్యాదు



ఆర్ఎంఓ డాక్టర్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రకాష్ తదితరులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం వచ్చిన బిళ్ల బాలరాజు వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ బత్తు వెంకటసతీష్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జీజీహెచ్ క్యాజువాలిటీలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, జూనియర్ డాక్టర్లు వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరుతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల పేదలకు సకాలంలో చికిత్స అందక చనిపోతున్నారని ఆరోపించారు. సంఘటనపై విచారణ జరిపి సీనియర్ వైద్యులు క్యాజువాలిటీలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి శ్రీనివాస్, భీమ్ భారత్ నేతలు దొడ్డా రాజేంద్రప్రసాద్, ఎస్.కె.బాజీ, ఎర్రగుంట్ల సుజాతారావు, బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాడికొండ నరసింహారావు ఉన్నారు.

వీరభద్రుడికి విశేష పూజలు

పెదనందిపాడు: స్థానిక లావు బజారులోని శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం అర్చకులు మండపారాధన, వాస్తు పూజతో పాటు పలు పూజల్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్త సమాజం భజన ఆకట్టుకుంది. విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

బొమ్మదేవరకు సత్కారం



తెనాలి: మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యునిగా నియమితులైన బొమ్మదేవర వెంకటేశ్వరరావును తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం సోమవారం సత్కరించింది. సంఘ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. బొమ్మదేవర వెంకటేశ్వరరావు సంఘం ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. నూతనంగా మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సభ్యత్వం లభించటంతో ఈ అభినందన సభను ఏర్పాటుచేశారు. సంఘ పాలకవర్గ సభ్యులు, ఎన్జీఓ, పెన్షనర్స్, తెనాలి శాఖ నాయకులు, మాజీ సైనిక సంఘం సభ్యులు బొమ్మదేవరను సత్కరించినవారిలో ఉన్నారు. సంఘ కోశాధికారి నారాయణం కమల్‌కుమార్, ఉపాధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, ఆర్ఎస్ శంకరరావు, సోమయ్యశాస్త్రి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మురుగు కాల్వను పరిశీలించిన డీఎల్‌పీవో



స్థానికులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో లక్ష్మణరావు

పెదనందిపాడు: మురుగు కాల్వ పూడిపోయి, నీరు పారక అవస్థలు పడుతున్నామని గ్రామస్తుడు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఉదయం గుంటూరు డీఎల్‌పీవో వి.వి.ఎం. లక్ష్మణరావు పెదనందిపాడులో పర్యటించారు. గుంటూరు పర్చూరు ప్రధాన రహదారిలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న మురుగు కాల్వను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదనందిపాడు గ్రామస్తుడు సాంబశివరావులో స్పందనలో అర్జీ ఇచ్చారని, దాన్ని పరిశీలించటానికి వచ్చామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బీ ఇంజినీర్లతో సర్వే చేయించి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలియజేశారు. ఆయన వెంట కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాదరావు

కొండపాటూరు(కాకుమాను): పోలేరమ్మ తల్లి తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమయ్వయంతో పని చేయాలని తహసీల్దార్ జె.ప్రసాదరావు సూచించారు. మండలంలోని కొండపాటూరులో పోలేరమ్మ తల్లి తిరునాళ్లనను వచ్చే నెల 11న నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభల్ని నిర్మించుకోవడానికి గానూ తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు అధికారుల్ని కోరారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, దేవాలయ చైర్మన్ రామినేని నాగవేణి, గ్రామ సర్పంచ్ యర్రాకుల కామేశ్వరి, ఈఓ సురేష్, ధర్మకర్తల మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్య పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కీర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రభుత్వం నులిపురుగుల నిర్మూలన కోసం ఉచితంగా మాత్రలు పంపిణీ చేస్తోందని ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి జి.కీర్తి పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చేపడుతున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

డాక్టర్ కీర్తి మాట్లాడుతూ చేతుల ద్వారా ఎన్నో క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయని, తద్వారా మనం అనారోగ్యం బారిన పడతామని తెలిపారు. మంచి అలవాట్ల ద్వారా రోగాల బారిన పడకుండా సురక్షితంగా ఉండవచ్చని విద్యార్థులకు సూచించారు. వ్యక్తిగత శుభ్రత, జంక్ ఫుడ్‌కు దూ రంగా ఉండటం ద్వారా నులి పురుగుల్ని నివారించవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతి ఆర్నెల్లకోసారి నులి పురుగుల నివారణ మాత్రల్ని పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కృష్ణకిశోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధి ధ్యేయంగా బడ్జెట్ రూపకల్పన

మేయర్ కావటి మేయర్ కావటి



అధికారులతో సమావేశమైన మేయర్ కావటి

నెహ్రూనగర్: 2023–24 సంవత్సరానికి గానూ నగరపాలక సంస్థ రూపొందించిన బడ్జెట్ గుంటూరు నగరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. ఈ నెలాఖరులోపు ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌పై మేయర్ అధ్యక్షతన సోమవారం ఆయన చాంబర్‌లో వివిధ విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ ఆదాయ వ్యయాలు, బడ్జెట్ అంచనాలపై అధికారులతో మేయర్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా గుంటూరు నగరంలో ప్రతి ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా కృషి చేస్తామని తెలిపారు. నగరపాలక సంస్థ ఆదాయం పెంపుదలకు, కొత్త ఆదాయ మార్గాల అన్వేషణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నగరపాలక సంస్థకు వచ్చే ఆదాయంలో అధిక భాగం ఆస్తి పన్ను వసూళ్ల ద్వారా వస్తోందని తెలియజేశారు. నగరపాలక సంస్థకు వచ్చే ఆదాయాలు, చేసే వ్యయాలతో వాస్తవిక అంచనాలతో అభివృద్ధే ప్రధాన అజెండాగా బడ్జెట్ ఉంటుందని వివరించారు. తాగునీరు, పారిశుద్ధ్యంతో పాటు నగరంలో పచ్చదనం పెంపు, రోడ్ల విస్తరణకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, ఈఈ ఎ. నాగేంద్ర కుమార్, యస్ఈ భాస్కరరావు, సీపీ మూర్తి, సీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, డీసీపీ కోటయ్య, ఎంహెచ్ఓ భానుప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం

అధికారులకు అడిషనల్ కమిషనర్ రోజా ఆదేశం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ రోజా

నెహ్రూనగర్: ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదేశించారు. ప్రజల సమస్యల్ని తక్షణం పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై చర్యలు తప్పవని తెలిపారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం అదనపు కమిషనర్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలని తెలిపారు. వార్డు సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 54 ఫిర్యాదులు అందాయని చెప్పారు.

ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 22, ప్రజారోగ్య విభాగానికి మూడు , రెవెన్యూ విభాగానికి 11, ఉపా సెల్ విభాగానికి ఐదు, అకౌంట్స్ విభాగానికి ఒకటి, పరిపాలన విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ మూర్తి, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.